క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

ఓజిలి: మండలంలోని అత్తివరం గ్రామంలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు గుంటమడుగు రవీంద్రరాజు తెలిపారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సత్తా చాటిన ఎన్‌బీకేఆర్ విద్యార్థులు



శ్రీహరికి బహుమతి అందజేస్తున్న కల్నల్ చంద్రశేఖర్

కోట: ఎన్‌సీసీ నావల్ యూనిట్ 7వ వార్షిక శిక్షణ శిబిరంలో విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ ఎన్‌సీసీ విద్యార్థులు పలు అంశాల్లో ప్రతిభ కనబరిచినట్లు కళాశాల డైరెక్టర్ విజయకుమార్ రెడ్డి శనివారం తెలిపారు. నార్త్ రాజుపాళెం లోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో పదిరోజుల పాటు ఎన్‌సీసీ నావల్ యూనిట్ శిక్షణ శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. ఫైరింగ్ విభాగంలో క్యాడెట్ కెప్టెన్ లౌక్య, షిప్ మోడలింగ్‌లో గోవిందరాజు, డ్రిల్, కవాతులో శ్రీహరి ప్రథమస్థానం సాధించి కల్నల్ చంద్రశేఖర్ చేతులమీదుగా బహుమతులు అందుకున్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తికి తీవ్రగాయాలు



వెంకటగిరిరూరల్: రైలు నుంచి జారిపడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈఘటన జీకే పల్లి–ఎల్లకారు మధ్య చోటుచేసుకుంది. వెస్ట్ బెంగాల్ రాయపూర్‌కు చెందిన ఎస్‌కే షఫీర్ గూడూరు నుంచి తిరుపతి వైపు వెళ్తున్న ఓ రైల్లో శుక్రవారం ప్రయాణిస్తున్నాడు. రాత్రి ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి కింద పడ్డాడు. శనివారం ఉదయం వరకు రక్త గాయాలతో ముళ్లపొదల్లో బాధితుడు పడి ఉన్నాడు. ఉదయం విధుల్లో ఉన్న రైల్వేట్రాక్ సిబ్బంది గుర్తించి 108కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న డక్కిలి 108 సిబ్బంది వినయ్‌సూర్య, సుధాకర్ ముళ్లపొదల నుంచి క్షతగ్రాతుని స్ట్రెచ్చర్‌పై మోసుకెళ్లి వెంకటగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న దాతలు

రాపూరు: పెంచలకోన ఆలయ నిత్యాన్నదాన పథకానికి శనివారం వైఎస్సార్ జిల్లా అనిక నరసయ్య, దేవి జ్ఞాపకార్థం కుమారుడు లక్ష్మీనరసయ్య, విజయలక్ష్మి దంపతులు రూ.1,09,000 నగదు విరాళంగా అందించినట్లు దేవస్థాన ప్రధానార్చకులు బాలాజీ స్వామి తెలిపారు. దాతలకు మూడు ఆలయాల్లో ప్రత్యేక దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ సిబ్బంది పెంచల రెడ్డి, హరీష్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు

వాకాడు: స్థానిక రజకుల వీధిలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానికుల వివరాల మేరకు.. నివాసాల మధ్య ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చాలా కాలంగా మరమ్మతులకు గురైందన్నారు. ఈ విషయమై పలుమార్లు విద్యుత్ అధికారులకు, సిబ్బందికి తెలిపినా పట్టించుకోలేదన్నారు. ఫలితంగా ట్రాన్స్‌ఫార్మర్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. విద్యుత్ అధికారులు అక్కడికి చేరుకుని మంటలు అదుపుచేశారు. ఎటువంటి ప్రమాదం చోటుచేసుకోకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

కార్గో జిల్లా అధికారిగా సురేంద్రబాబు


సురేంద్రబాబు

తిరుపతి అర్బన్: ఆర్టీసీ తిరుపతి జిల్లా కార్గో అధికారిగా సురేంద్రబాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రకాశం జిల్లా నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న జీఎల్‌పీపీ సుబ్బారావు పశ్చిమగోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. ఆర్టీసీ కార్గో అధికారులు శనివారం జీఎల్‌పీపీ సుబ్బారావుకు వీడ్కోలు పలుకుతూ సురేంద్రబాబుకు స్వాగతం పలికారు.



• బత్తినపట్ల వీరారెడ్డిది వెంకటగిరి రూరల్ మండలం పెట్లూరు. ఈయన తన పిల్లల చదువు కోసం అవసరమైన సర్టిఫికెట్లు కావాలని వలంటీర్‌కు చెప్పారు. సచివాలయాల ఉద్యోగుల ద్వారా సర్టిఫికెట్ మంజూరు చేయించి, ఇంటికి తెచ్చి ఇచ్చారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన చాలా బాగుందని ఆయన కితాబిస్తున్నారు.



• వెంకటగిరి రూరల్ మండలం జంగాలపల్లికు చెందిన కె.బక్కయ్య గతంలో ఆధార్‌కార్డు అప్‌డేట్ కోసం మీ సేవా కేంద్రాల్లో పడిగాపులు కాశాడు. ప్రస్తుతం సచివాలయంలోనే ఆధార్ అప్‌డేట్ కేంద్రం ఏర్పాటు చేయడంతో ఆయన ఆధార్ సులభంగా అప్‌డేట్ అయ్యింది. అలాగే రేషన్‌కార్డు కోసం ఏళ్లుగా ఎదురుచూసిన ఆయనకు బియ్యంకార్డు సైతం వారంలోగా అందించారు.

సేవాలయాలు

• పౌర సేవలకు చిరునామా
• సచివాలయాలతో గ్రామ స్వరాజ్యం

అవినీతి లేదు.. కార్యాలయాల ప్రదక్షిణల అవసరం అంతకన్నా లేదు.. సమయం వృథా కాలేదు.. ఒక్కొక్క కార్యాలయానికి ఒక్కొక్క చోటుకు వెళ్లాల్సిన పని లేదు.. ప్రజల ముంగిటకే వేగవంతంగా అన్ని ప్రభుత్వ సేవలు. ఇదీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019, అక్టోబర్ 2న ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ సేవాలయ వ్యవస్థగా విరాజిల్లుతోంది. దీనిపై ప్రత్యేక కథనం.


సచివాలయంలో ఆధార్‌సేవలు



జంగాలపల్లి సచివాలయం

	సచివాలయాల సంఖ్య	సిబ్బంది	వలంటీర్లు	అందించిన సేవలు
వెంకటగిరి అర్బన్	14	96	282	30,136
వెంకటగిరి రూరల్	12	153	109	12,120

వెంకటగిరి/వెంకటగిరిరూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనం ఇబ్బందులు తొలగించేందుకు ప్రారంభించిన సచివాలయాలు పౌర సేవలకు చిరునామాగా నిలుస్తున్నాయి. వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలోని 25 వార్డులకుగానూ 14 వార్డు సచివాలయాలు, రూరల్ పరిధిలో 12 సచివాలయాలు ఏర్పాటయ్యాయి. ఈ సచివాలయాల పరిధిలో మొత్తం 249 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీటికి తోడు ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటీర్ వంతున వెంకటగిరి అర్బన్, రూరల్ పరిధిలో మొత్తం 391 మంది వలంటీర్లు ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా సేవలందిస్తున్నారు. ఇందులో భాగంగా వెంకటగిరి అర్బన్, రూరల్ పరిధిలో ఇప్పటి వరకూ 42,256 సేవలు అందజేశారు.

గ్రామాల్లోనే పలు శాఖలు..

గతంలో ప్రతి పనికి మండల కేంద్రానికి వెళ్లాల్సివచ్చేది. అక్కడ కూడా ఒక్కొక్క కార్యాలయం ఒక్కొక్క ప్రాంతంలో ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వచ్చేది. కానీ సచివాలయాల్లో పలు శాఖల ఉద్యోగులు ఒకే చోట విధులు నిర్వరిస్తున్నారు. దీంతో ప్రజలకు అన్ని రకాల సేవలు అందుతున్నాయి.

ఉద్యోగాల విప్లవం

సచివాలయ వ్యవస్థతో ఉద్యోగాల విప్లవం సృష్టించారు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. నాడు ఇచ్చిన మాట మేరకు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రొబేషన్ డిక్లేర్ చేసి, రెగ్యులర్ పేస్కేల్ కిందకు తీసుకొచ్చారు. దీంతో సచివాలయ ఉద్యోగుల ప్రభుత్వ ఉద్యోగం కల సాకారమైంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో సచివాలయ ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

భాగస్వామినైనందుకు గర్విస్తున్నా..



వలంటీర్ వ్యవస్థలో నేను కూడా ఒక భాగస్వామినైనందుకు గర్విస్తున్నాను. ప్రజలకు సేవ చేసుకునే అవకాశం కలిగినందుకు సంతోషంగా ఉంది. క్లస్టర్ పరిధిలో అవ్వాతాతలకు పింఛన్ కానుక అందించే సమయంలో, పేదలందరికీ ఇళ్ల పథకంలో పట్టాలు మంజూరు చేయించినప్పుడు, రేషన్‌కార్డు లేనివారిని గుర్తించి వారికి కార్డులు మంజూరు చేయించినప్పుడు వారి కళ్లల్లో చూస్తున్న ఆనందం ఎప్పటికీ మరిచిపోలేను.

–పి.శాంతిలక్ష్మి, వలంటీర్, సేవావజ్ర పురస్కార గ్రహీత

ప్రభుత్వ లక్ష్యం మేరకు సేవలు..



ప్రజలకు ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అందజేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. ఆ లక్ష్యం మేరకు ప్రజలకు సేవలందిస్తున్నాం. నిరంతరం సచివాలయాలను సందర్శించడంతోపాటు ప్రజలకు అందించే సేవలను పర్యవేక్షిస్తున్నాం. సచివాలయ వ్యవస్థతో ప్రజలకు మెరుగైన సేవలందించడంతోపాటు వేలాదిమంది యువతకు ఉద్యోగాలు వచ్చాయి.

– డీవీ రామయ్య, మున్సిపల్ కమిషనర్, వెంకటగిరి

అనుమతుల్లేక కుంటుపడిన అభివృద్ధి

• ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్‌ను కలిసిన ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు


ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్‌ను కలిసి సమస్యను వివరిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరు: అటవీశాఖ అనమతులు లేకపోవడంతో నియోజకవర్గంలోని రహదారులు అభివృద్ధి కుంటుపడుతోందని, అనమతులిస్తే అభివృద్ధి చేసుకుంటామని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, విజయవాడలో ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్‌ను శనివారం కలిసి కోరారు. ఈ మేరకు ఆయన సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని చిట్టమూరు, వాకాడు, చిల్లకూరు మండలాల్లోని రోడ్ల అభివృద్ధిపై ఆయనతో చర్చించామన్నారు. అటవీ శాఖ అనుమతులు లేకపోవడంతో మొనపాళెం నుంచి నవాబుపేట, గొల్లలనట్టు నుంచి కర్కేడు, పున్నపువారిపాళెం నుంచి జాతీయ రహదారి రోడ్డు సౌకర్యం లేక, ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రోడ్లు వేసుకునేందుకు అనుమతి కోరామని చెప్పారు. ఈ మేరకు ఆయన స్పందించారని, జిల్లా అటవీ శాఖాధికారులతో మాట్లాడి, అటవీ శాఖ ద్వారా అనుమతులు వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. అదే విధంగా ఏపీఐఐసీ జనరల్ మేనేజర్ సుబ్బారెడ్డిని కలిసి, ఆటోనగర్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ సౌకర్యంతోపాటు పలు మౌలికవసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరామని పేర్కొన్నారు. ఆయన కూడా సానుకూలంగా స్పందించారని, త్వరలో ఆటోనగర్ అన్ని మౌలిక వసతులతో సిద్ధం కానుందని తెలిపారు.

పశు బీమాను సద్వినియోగం చేసుకోండి

• పశుసంవర్ధక శాఖ డీడీ డాక్టర్ సురేష్


సమావేశంలో మాట్లాడుతున్న డీడీ సురేష్

కలువాయి: పశుసంవర్ధక శాఖ ద్వారా అమలవుతున్న పశు బీమా పథకం కింద రైతులు పాడి పశువులు, గొర్రెలకు బీమా చేయించుకోవాలని ఆ శాఖ నెల్లూరు డీడీ డాక్టర్ సురేష్ తెలిపారు. కలువాయి ఏరియా పశువైద్యశాలలో కలువాయి, చేజర్ల మండలాల పశువైద్యులు, సిబ్బందితో శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీమా ప్రీమియంలను వివరించారు. పేయూత లబ్ధిదారులు పశుకిసాన్ క్రెడిట్ కార్డులు పూరించి సంబంధిత డాక్టర్లకు అందజేసేలా ఏహెచ్‌ఏలను ఆదేశించారు. సంపూర్ణ మిశ్రమ దాణాను రైతులకు ఆర్బీకేల ద్వారా ఇండెంట్ చేసి అందజేయాలన్నారు. 75 శాతం సబ్సిడీ కింద పశుగ్రాస విత్తనాలు రైతులకు సరఫరా చేయాలని చెప్పారు. కలువాయి, చేజర్ల మండలాల పశువైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అశ్వవాహనంపై చెంగాళమ్మ


అశ్వవాహనంపై విహరిస్తున్న చెంగాళమ్మ

సూళ్లూరుపేట: బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజైన శుక్రవారం రాత్రి చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారు అశ్వవాహనాన్ని అధిరోహించి గ్రామంలో ఊరేగుతూ కనువిందు చేశారు. కేరళ, ఆంధ్రా, తమిళనాడుకు చెందిన వివిధ రకాల మేళతాళాలు, బాణసంచా నడుమ గ్రామోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. అమ్మవారు సూళ్లూరు గ్రామశక్తి కావడంతో సూళ్లూరులోని అన్ని వీధుల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో వీధులన్నీ శుభ్రం చేసి రంగు రంగుల రంగవల్లులు వేసి అమ్మవారికి ఆహ్వానం పలికారు. అనంతరం కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి ఊరేగింపు ట్రాక్టర్‌ను చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య స్వయంగా నడిపి ఉత్సవాన్ని ప్రారంభించారు. ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం


ఏర్పాటు చేసిన హోమాలు


సైదాపురం: పొలూరు రాజుపాళెంలోని సీతారాముల దేవస్థానంలో సీతారాములు, లక్ష్మణ ఆంజనేయస్వామి నూతన విగ్రహ ప్రతిష్ట, మహాకుంభాభిషేక మహోత్సవాలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి 36మంది వేదపండితులు ఆధ్వర్యంలో శని, ఆది, సోమవారాల్లో మూడు రోజుల పాటు విశేషాభిషేకాలు, పూజలు, హోమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం గణపతి పూజతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాయంత్రం 4గంటలకు యాగశాల హోమాలు చేశారు. ఆదివారం ప్రధాన దేవతల హోమాలు, సోమవారం నూతన విగ్రహ ప్రతిష్ట, సాయంత్రం స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.


పండ్ల సాగుకు ప్రోత్సాహం


అవగాహన కల్పిస్తున్న ఏపీఓ గిరిబాబు

చిల్లకూరు: చిన్న, సన్న కారు రైతులు పండ్ల తోటలు సాగు చేసేందుకు అవసరమైన సహకారం అందించి ప్రోత్సహించేలా ఉపాధి హామీ పథకం ఉపయోగపడుతోందని ఏపీఓ గిరిబాబు తెలిపారు. అన్నంబాకలో శనివారం ఉపాధి కూలీలకు పండ్ల తోటల పెంపకంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ అన్నంబాకం పరిసరాల్లో ఎక్కువగా మామిడి తోటలు సాగు అవుతున్నందున చిన్న, సన్నకారు రైతులు ముందుకొస్తే వారికి సరైన ప్రోత్సాహం ఇచ్చి మామిడి, జామ, సపోట లాంటి పండ్ల తోటలను సాగుచేసునేందుకు సహకారం అందిస్తామని చెప్పారు. మూడేళ్ల పాటు పండ్ల తోటలు పెంచుకునేందుకు అవసరమైన నిధులను చెల్లిస్తామని చెప్పారు.

చెంగాళమ్మ తిరునాళ్లలో విద్యుత్‌శోభ


విద్యుద్దీపాల అలంకరణతో ఇంద్రధనస్సును తలపిస్తున్న చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయం,


విద్యుద్దీపాలతో రంగుల రాట్నాలు

సూళ్లూరుపేట: చెంగాళమ్మ పరమేశ్వరి తిరునాళ్ల రంగు రంగుల విద్యుద్దీపాల కాంతులతో సూళ్లూరుపేట పట్టణ శోభాయమానం తయారైంది. హోలీక్రాస్ సెంటర్‌లోని ఉత్తరవైపు చెంగాళమ్మ స్వాగత ద్వారం నుంచి దక్షిణంవైపు స్వాగత ద్వారం దాకా రంగు రంగుల ఎల్‌ఈడీ బోర్డుల లైట్లతో కళకళలాడుతోంది. ఆలయం, ఆలయం ముందున్న రాజగోపురాన్ని ఎల్‌ఈడీ లైట్లతో అందంగా అలంకరించారు. అదేవిధంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించే వేదిక ప్రాంగణంలో ఏర్పాట్లు చేసిన రంగుల రాట్నాల ఎగ్జిబిషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆలయం, వేదిక ప్రాంగణం లైటింగ్‌తో ధగధగలాడుతోంది. చెంగాళమ్మ తిరునాళ్ల వైభవంగా నిర్వహించడంతో పట్టణమంతా పండుగ వాతావరణం నెలకొంది.

సంక్షేమ పథకాలతో సరికొత్త చరిత్ర


లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

• సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేటటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలను గడప గడపకూ తీసుకెళుతూ, సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం సరికొత్త చరిత్ర సృష్టిస్తున్నట్లు సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పేర్కొన్నారు. మండలంలోని అత్తిమిట్ట, పుదూరు అరుంధతి కాలనీ, కుప్పరగుంట గ్రామాల్లో శనివారం ఎమ్మెల్యే కిలివేటి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే, నేతలకు స్థానికుల నుంచి ఘన స్వాగతం లభించింది. ఎమ్మెల్యే, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో కలసి గ్రామాల్లోని ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి బుక్‌లెట్లను అందజేశారు. స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేంద్ర, ఎంపీడీఓ శివప్రసాద్, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, ఎంపీపీ ధనలక్ష్మి, సర్పంచ్ మల్లావు సుమతి, ఎంపీటీసీ కంచి నరసమ్మ, పార్టీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, రూరల్ జేసీఎస్ కన్వీనర్ ఒట్టూరు కిషోర్ యాదవ్, వైఎస్సార్‌సీపీ నేతలు గోనుపల్లి గురుమూర్తి, కామిరెడ్డి రాజారెడ్డి, కలికి మాధవరెడ్డి, బైనా మల్లికార్జున రెడ్డి, కటకం జయరామయ్య, వేణుంబాక లక్ష్మీనారాయణరెడ్డి, పిలాని మణి, వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి, రాహుల్ పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్ ఏర్పాటు అభినందనీయం


ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న షారీనా

గూడూరు: ఏరియా ఆస్పత్రిలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు అభినందనీయమని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎస్‌కే షారీనా పేర్కొన్నారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో రోటరీ క్లబ్ గూడూరు వెస్ట్ ఆధ్వర్యంలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్, సీనియర్ రొటేరియన్ శ్రీకంఠి రామ్మోహన్‌రావు దాతృత్వంతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను శనివారం ప్రారంభించారు. దాత రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రికి వచ్చే వారంతా పేదలేనని, తాగునీరు లేక, బయటకు వెళ్లి కొనాల్సి వస్తోందని, సమస్యను తన దృష్టికి తీసుకురాగా ప్లాంట్ ఏర్పాటు చేశానన్నారు. వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, క్లబ్ అధ్యక్షుడు బండి ధనుంజయరెడ్డి, రొటేరియన్‌లు వి. శ్రీనివాసులు, భాస్కర్‌రెడ్డి, వాసుగౌడ్, విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

నాలుగు కిలోల గంజాయి స్వాధీనం


నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఎస్‌ఈబీ అధికారులు

–ఒకరి అరెస్ట్

గూడూరు: గూడూరు ఎస్‌ఈబీ అధికారులు నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ తెలిపారు. స్థానిక రెండవ పట్టణంలోని జానకిరాంపేట ప్రాంతంలోని ఎస్‌ఈబీ కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. శనివారం గూడూరు రైల్వేస్టేషన్ సమీపంలో ఎస్‌ఈబీ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా, ఓ వ్యక్తి బ్యాగుతో అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో అతన్ని అదుపులోకి తీసుకున్నామన్నారు. తనిఖీ చేయగా అతని వద్ద నాలుగు కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించామన్నారు. విచారణలో అతను వైజాగ్‌కు చెందిన పి.సాయిహరినారాయణగానూ, అక్కడి నుంచి గంజాయిని తీసుకొచ్చి గూడూరులో విక్రయిస్తుంటాడని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి, కోర్టుకు హాజరుపరిచామని తెలిపారు. దాడిలో ఎస్‌ఐ శేషమ్మ, సిబ్బంది కిరణ్‌సింగ్, ఆనంద్‌బాబు, కృష్ణయ్య, గౌస్‌బాషా పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


హాజరైన భక్తులు

రాపూరు: పెంచలకోన క్షేత్రంలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవిల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం 4 అభిషేకం, 5 గంటలకు సుప్రభాతం, 6గంటకు పూలంగిసేవ నిర్వహించారు. 10 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నిత్య కల్యాణ మండపంలో కొలువుదీర్చి వివిధ రకాల ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి వేదపండితుల మంత్రోచ్ఛరణలతో కల్యాణం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు స్వామి అమ్మవార్లను తిరుచ్చిలో ఉంచి సహస్రదీపాలంకరణ మండపంలో కొలువుదీర్చి ఊంజల్‌సేవ నిర్వహించారు.

జూలై 8న స్కూల్ స్వీపర్స్ రాష్ట్ర మహాసభలు

తిరుపతి కల్చరల్: విజయవాడలో జూలై 8వ తేదీన స్కూల్ స్వీపర్స్ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ తెలిపారు. బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో శనివారం స్కూల్ స్వీపర్స్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్రంలోని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు జీతాలు పెంచాలని అన్నారు. స్కూల్ స్వీపర్స్‌పై పనిభారం పెరుగుతున్నా రెగ్యులర్‌గా జీతాలు ఇవ్వడం లేదని ఆయన పేర్కొన్నారు. ఈ సమస్యలపై ఈనెల 19వ తేదీన చిత్తూరు జిల్లా కలెక్టర్‌ను, డీఈఓను కలిసి వినతి పత్రం సమర్పించాలని తీర్మానించినట్లు ఆయన పేర్కొన్నారు.

మూసుకుపోతున్న గంగ మేజర్ కాలువ

• దెబ్బతిన్న కాంక్రీట్ నిర్మాణాలు


కల్లూరు వద్ద ముళ్ల పొదలతో మూసుకుపోయిన కాలువ

దొరవారిసత్రం: దొరవారిసత్రం, సూళ్లూరుపేట మండలం ప్రాంతంలో 25 కిలోమీటర్లు విస్తరించి ఉన్న తెలుగుగంగ 14ఆర్ మేజర్ కాలువ ద్వారా గంగ జలాలు రైతుల దరిచేరక ముందే పిచ్చిమొక్కలతో, ముళ్లపొదలతో కాలువ మూసుకుపోయింది. అదేవిధంగా ఈకాలువ ద్వారా చెరువుల్లో గంగ జలాలు సులువుగా చేరేలా కాంక్రీట్‌తో నిర్మించి యూటీలు, తూములు అన్నీ శిథిలావస్థకు చేరుకుని పగుళ్లు వచ్చాయి. ఇప్పటికే మండల పరిధిలోని నెల్లూరుపల్లి, మినమనముడి, నెలబల్లి, కల్లూరు, ఆనేపూడి ప్రాంతాల్లో 14ఆర్ మేజర్ కాలువపై నిర్మించిన వంతెనలు, యూటీలు, తూములు దెబ్బతిన్నాయి. ఇలాగే వదిలేస్తే కాంక్రీట్ నిర్మాణాలు పనికిరాకుండా పోతాయని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు ముళ్ల పొదలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని డీవీ సత్రం, సూళ్లూరుపేట మండలాల్లోని మెట్ట రైతులు కోరుతున్నారు.